క్లుప్తంగా

ఘనంగా నేస్తాలమ్మ పండగ

రాంబిల్లి : మర్రిపాలెం గ్రామంలో గురువారం నేస్తాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అన్న సమారాధన కార్యక్రమంతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

అందరి సహకారంతో గ్రామానికి మౌలిక వసతులు

మునగపాక : అందరి సహకారంతో మునగపాక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. గ్రామానికి అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించేందుకు శక్తివంచన లేకుండా పాలక వర్గం కృషి చేస్తుందన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారిస్తున్నామన్నారు. డ్రైన్లు, రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, గణేష్, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ



కె.వెంకటాపురంలో పోషకాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసి ప్రాముఖ్యతను వివరించారు. తల్లీ బిడ్డా క్షేమంగా, ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఉచితంగా పోషణ కిట్లు అందజేస్తోందని, ఇంట్లో లభించే ఆకుకూరలు, పప్పులతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చని వివరించారు.

బొడ్డేడకు మహిళా నేతల అభినందన



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న మహిళా నేతలు

మునగపాక : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు గురువారం మహిళా నేతలు ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్ నియమితులైన సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు బొడ్డేడ క్యాంప్ కార్యాలయానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, కశింకోట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, గృహ సారథి నీలకంఠ లక్ష్మి, బుదిరెడ్డి చినమ్మలు, అవిటి ధనలక్ష్మి తదితరులు ప్రసాద్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు



కోటవురట్లలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ సింహాద్రప్పడు

కోటవురట్ల : ప్రపంచ జూనోసిస్ డేను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సింహాద్రప్పడు వ్యాక్సిన్లు వేసి దాని ఆవశ్యకతను వివరించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 50 కుక్కలకు వ్యాక్సిన్లు వేసినట్టు తెలిపారు. తంగేడు వైద్యాధికారి ఆర్.ప్రతాప్‌కుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



బయ్యవరంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



దుప్పుతూరులో ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

- యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- బయ్యవరంలో 880 మందికి ధ్రువపత్రాల పంపిణీ

యలమంచిలి : అర్హతేనే ప్రామాణికంగా తీసుకుని కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో జగనన్న పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. యలమంచిలి మండలంలో బయ్యవరం గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 880 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలను ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలిసి అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలందరూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో మండల జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి అనకాపల్లి డీఎఫ్ఓ లక్ష్మణరావు, ఎంపీడీవో అప్పలనాయుడు, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త మండల వైఎస్సార్ సీపీ నాయకులు సేనాపతి రాము, యలమంచిలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, యలమంచిలి రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, బయ్యవరం సర్పంచ్ మొగలిపల్లి సత్యనారాయణ, పీఎస్ఆర్ పేట సర్పంచ్ గొన్నాబత్తుల శివ తహసీల్దార్ రాణీ అమ్మాజీ, వైయస్సార్‌సీపీ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ధ్రువపత్రాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విప్లవాత్మక మార్పులు చేపట్టిన సీఎం జగనన్న, ప్రస్తుతం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ద్వారా అన్ని రకాల ధ్రువపత్రాలు ప్రజల చెంతకే వస్తున్నాయని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు.అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 11 రకాల ధ్రువపత్రాల కోసం ఎటువంటి సిఫారసులు, ఒత్తిళ్లు లేకుండా అర్హులందరికీ పత్రాలు అందించడం మంచి కార్యక్రమంగా అభివర్ణించారు. జెడ్పీటీసీ రాంబాబు, ఎంపీపీ బుజ్జి, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, దుప్పుతూరు సర్పంచ్ శంకర్‌రావు, కూండ్రపు విమలనాయుడు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోవింద్, ప్రజాప్రతినిధులు

యలమంచిలి : దేశంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా దేశానికి ఎన్నో సేవలందించారని కొనియాడారు. దేశంలో హరిత విప్లవం, వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో ఆయన కృషి దాగి ఉందని, 1974లో దేశంలో కరువు సంభవించినపుడు ఆహార సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు త్రినాథ్, మండల విస్తరణాధికారి ప్రసాద్, డివిజనల్ వ్యవసాయాధికారి, రవి ప్రకాష్, దేవి ప్రసాద్, మోహనరావు, నానాజీ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించే బాధ్యత మీదే

అధికారులకు ఆర్‌డీవో ఆదేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డీవో

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం ఆదేశించారు. గురువారం ఆయన నక్కపల్లిలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులకు ఐరన్, సిమెంట్, ఇసుక సరఫరా సక్రమంగానే జరుగుతోందని, బిల్లు చెల్లింపులు కూడా జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. దేవవరం, దొంకాడ, తదితర గ్రామాల్లో లేఅవుట్లకు రహదారి సమస్యలు ఉన్నాయని రోడ్డు లేక ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని అధికారులు వివరించారు. ప్రభుత్వ భూములు ఉంటే తీసుకుని రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రైవేటు భూములైతే ప్రత్యామ్నాయంగా వారికి భూములు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు డీటీ నీరజ, హౌసింగ్ ఏఈ రాజు పాల్గొన్నారు.

అణుకు సమస్యలపై అలసత్వం తగదు



అణుకులో సమస్యలను వివరిస్తున్న సీపీఎం నేత అప్పలరాజు

కోటవురట్ల : అణుకులోని సమస్యలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. అణుకులో గురువారం గిరిజనులను కలుసుకుని సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. అధికారులు స్పందించే వరకు పోరాటం చేయాలన్నారు. ఇందుకోసం శుక్రవారం నుంచి గ్రామంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అణుకు గ్రామం నుంచి గొట్టివాడ మెయిన్‌రోడ్డు వరకు 6 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించాలని, గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల లేకపోవడంతో రాళ్లతో అధ్వానంగా ఉన్న రోడ్డులో రానుపోను 12 కిలోమీటర్లు నడిచి చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామంలో సిగ్నల్ లేకపోవడంతో రేషన్ కోసం గొట్టివాడ రావలసిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నో వినతులు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీంతో గిరిజనులతో రిలే నిరాహార దీక్షకు దిగుతున్నట్టు తెలిపారు.

రూ.9 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



తిమ్మరాజుపేటలో శ్మశానవాటిక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో నూతనంగా అభివృద్ధి చేసిన శ్మశానవాటికను గురువారం ఎమ్మెల్యే రమణమూర్తి ప్రారంభించారు. శ్మశానవాటిక అధ్వానంగా ఉండడంతో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ,పంచాయితీ నుంచి నిధులు సేకరించి శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. సుమారు రూ.9లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన శ్మశానవాటికను ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్,సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి,ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఆడారి గణేష్ పాల్గొన్నారు.

ప్రజల కోసం తపించే నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: నిరంతరం ప్రజల శ్రేయస్సుకోసం తపించే నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే కాకుండా పలు సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండలంలోని పల్లపు ఆనందపురం, తిమ్మరాజుపేట గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, సర్పంచ్‌లు అప్పయమ్మ, మంగలక్ష్మి, ఎంపీటీసీలు నానిబాబు, అప్పల నరసమ్మ, ఉప సర్పంచ్ జగన్, ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ ప్రకాశరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా నాడు-నేడు పనులు పూర్తి కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మి

ఎస్.రాయవరం: పాఠశాలలో చేపడుతున్న నాడు నేడు పనులు ఈ నెలాఖరుకు పూర్తి కావాలని డీఈవో వెంకటలక్ష్మి అన్నారు. పి.ధర్మవరం గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గ నాలుగు మండలాల నాడు నేడు పనులు జరుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యా ప్రణాళిక అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఉపాధ్యాయులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. మండలాల్లో అదనంగా ఎంఈవోలను కూడా నియమించడం జరిగిందని, చెప్పిన పనులు, జరగాల్సిన బోధన సకాలంలో జరగాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందివ్వాలన్నారు. పాఠశాలలో టార్ల్, లిప్, బైజూస్ కంటెంట్, లైబ్రరీ మెయింట్‌నెన్స్ విధిగా జరగాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రవి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటఉటర్ల మండలాల ఎంఈవోలు మూర్తి, అప్పారావు, కె.ఎల్.ఎన్.గాంధీ, కె.నరేస్, వి.రామారావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నరసింగబిల్లి నుంచి కంటి ఆపరేషన్లకు బస్సులో బయలు దేరడానికి సిద్ధంగా ఉన్న రోగులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 42 మంది హాజరు కాగా, వారిలో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

అనకాపల్లిటౌన్: మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. గ్రామసర్పంచ్ కొల్లిమల్లి గోవిందరావు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి గ్రామ ప్రజలతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద నేలవేషాలు, తప్పెటగుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతి వ్యక్తి సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం



నామవరం గ్రామంలో వర్షంలో కూడా గడప గడపకు తిరుగుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రతి వ్యక్తి సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని, అందుకోసం ఆయన నిత్యం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నామవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామంలో కలియతిరిగారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, స్వయంగా నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోను, ఏ ముఖ్యమంత్రి కూడా ప్రవేశ పెట్టని సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజలకు పాలనను చేరువ చేసి నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ వంటి ఎన్నో బృహత్కర కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు ముద్రించిన బ్రోచర్లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు సాయిబాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్‌ల అధ్యక్షులు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, మాజీ ఎంపీటీసీ రామాల శ్రీను, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, నామవరం రామాలయ కమిటీ అధ్యక్షుడు గదుల లోవరాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమలత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోజ్ కల్యాణ్ పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టరూ..



పైపులైను దెబ్బతిని వృథాగా పోతున్న తాగునీరు

ఎస్.రాయవరం: సర్వసిద్ధి పంచాయతీలో తాగునీటి పైపులైను దెబ్బతిని గుర్రై నీరు వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. సచివాలయ కార్యాలయానికి కూత వేటు దూరం ఈ సమస్య ఉన్నా సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్యను బుధవారం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి విచ్చేసిన ఈవోపీఆర్డీ సత్యనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. వెంటనే అక్కడ ఉన్న సచివాలయ సిబ్బందికి సరిచేయాలని ఆదేశించారు. అయినప్పటికీ గురువారం మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగ్యూను పారద్రోలాలి



అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): సీజన్ మారేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండ జాగ్రత్తు పాటించాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యురాలు అలేఖ్య పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ మహోత్సవాలను పురస్కరించుకొని అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. సీహెచ్‌ఓ వేణుగోపాల్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ అప్పలకొండ, ఉషోదయ నర్సింగ్ హోమ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తమ్మతల్లి పండగ



సత్తమ్మతల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

నక్కపల్లి: చిన దొడ్డిగల్లు సత్తమ్మతల్లి పండగ గురువారం అత్యంత ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద తిరునాళ్ల జరిగింది. జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు వాహనాలు బారులు తీరాయి. భక్తులు క్యూలో ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుష్టు నివారణపై అవగాహన కల్పించాలి



కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో గల మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తనిఖీ చేయించుకోవాలని పి.ధర్మవరం హెల్త్ వెల్‌నెస్ కేంద్రం క్లస్టర్ పర్యవేక్ష కులు షేక్ అమిర్ షాజిద్ అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని పి.ధర్మవరం హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు వ్యాధికి కారణాలు సకాలంలో గుర్తించకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతారని, వారికి అవగాహన కలిగించాలన్నారు. వైద్య సిబ్బంది గృహ సందర్శన చేసినపుడు రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వ్యాధి లక్షణాలు వివరించాలన్నారు. ఈ వ్యాధికి ప్రభుత్వం నుంచి పూర్తి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ కార్యదర్శి దలియమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పసల మారమ్మ ఉత్సవం



కశింకోటలో పసల మారమ్మ ఉత్సవ ఊరేగింపు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో పసల మారమ్మ ఉత్సవాన్ని గురువారం రైతులు, మహిళలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీర, రవికెలు, పండ్లు, పలహారాలు వగైరా పళ్లాల్లో వేసి, తలపై పెట్టుకుని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని పొలాల్లో ఉన్న అమ్మ వారి గుడి వద్ద పూజలు నిర్వహించారు. పశువులు, మనుషులకు విష సర్పాల వల్ల ఎటువంటి హాని జరగకుండా కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. కనకమహాలక్ష్మి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు స్థానిక మరిడిమాంబ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాయకరావుపేట: స్థానిక 33/11 కేవీ పాల్మన్‌పేట ఉపకేంద్రంలో మరమ్మతులు, పరిసర ప్రాంతాల్లో చెట్లకొమ్మల తొలగింపు వంటి కారణాలతో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట, ఈదటం, చినకందిపూడి, పెద్ద కందిపూడి గ్రామ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

మునగపాక: రాజుపేటలో గురువారం నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు. పేకాడుతున్నట్టు ఫిర్యాదు మేరకు సిబ్బందితో దాడి జరిపి పట్టుకున్నామన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి

అచ్యుతాపురం(అనకాపల్లి): భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం శ్యాం ముఖర్జీ జయంతి పురస్కరించుకొని ముఖర్జీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ రాజాన సన్యాసినాయుడు మాట్లాడుతూ జాతీయ వాదిగా ముఖర్జీ ప్రఖ్యాతి పొందారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు నూకునాయుడు, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.